ప్రజాశక్తి

సోమవారం 1 మే 2023 12 పేజీలు

తూర్పుగోదావరి కాకినాడ కోనసీమ







ఆదిరెడ్డి కుటుంబంపై సిఐడి

- సిఐడి అదుపులో మాజీ ఎంఎల్‌సి ఆదిరెడ్డి అప్పారావు, ఆయన కుమారుడు వాసు
- జగజ్జనని చిట్‌ఫండ్‌లో అక్రమాలే కారణం?
- విచారణ అనంతరం జిజిహెచ్‌కు తరలింపు



సిఐడి కార్యాలయం వద్దకు చేరుకున్న టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ఆదిరెడ్డి కుటుంబాని ఆదివారం షాక్ తగిలింది. మాజీ ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి అప్పారావు, అతని కుమారుడు, రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్‌ఎ భవాని భర్త ఆదిరెడ్డి వాసును సిఐడి పోలీసులు ఆదివారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. ఆదిరెడ్డి వాసు ప్రస్తుతం టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఉదయం 6.30 గంటలకు ఆదిరెడ్డి ఇంటికి చేరుకున్న పోలీసులు వారిద్దరినీ అరెస్టు చేసి లాలాచెరువు సమీపంలోని సిబి, సిఐడి రీజనల్ కార్యాలయానికి తరలించారు. వీరి అరెస్టుపై సిఐడి పోలీసులు ఎటువంటి ప్రకటనా చేయలేదు. విచారణ అనంతరం రాత్రి 10.30 గంటల సమయంలో ఆదిరెడ్డి అప్పారావు, ఆదిరెడ్డి వాసులను ఆరోగ్యపరీక్షల నిమిత్తం రాజమహేంద్రవరం జిజిహెచ్‌కు తరలించారు. అనంతరం న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు.

సిఐడి రీజనల్ కార్యాలయానికి భారీగా టిడిపి శ్రేణులు

ఆదిరెడ్డి అప్పారావు, వాసుల అరెస్టు గురించి తెలిసిన కొద్ది సేపటికే పెద్ద సంఖ్యలో టిడిపి నాయకులు, కార్యకర్తలు సిబిసిఐడి రీజినల్ కార్యాలయానికి చేరకున్నారు. దీంతో పోలీసులు కార్యాలయం గేట్లు మూసేశారు. లోనికి ఎవ్వరినీ అనుమతించలేదు.రాత్రి 9 గంటల తర్వాత కూడా రద్దీ కొనసాగింది. అరెస్టు నేపథ్యంలో మాజీ మంత్రులు కొల్లు రవీంద్ర, జవహర్, మాజీ ఎంఎల్‌ఎ నల్లమల్లి రామకృష్ణారెడ్డి, టిడిపి ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ సిఐడి రీజనల్ ఆఫీసుకు చేరుకుని మీడియాతో మాట్లాడారు.

అక్రమ కేసులకు భయపడేది లేదు : మాజీ మంత్రి కొల్లు రవీంద్ర

ఆదిరెడ్డి కుటుంబం టిడిపిలో యాక్టివ్‌గా ఉంది. దశాబ్ధాల కాలంగా వ్యాపారం చేస్తున్నారు. ఎటువంటి ఫిర్యాదు లేకుండా ఉద్దేశ పూర్వకంగా తప్పుడు కేసులు పెట్టారు. ముఖ్య మంత్రి జగన్‌మోహన్ రెడ్డి చుట్టూ 2లో

కార్టూ'నిజం'



రంగులు మార్చే నాయకులకి రంగుమారిన ధాన్యం రైతుల గోడు ఏం తెలుస్తుందిరా..!



ఎదుర్కోలు ఉత్సవంలో పాల్గొన్న ఇఒ తదితరులు

సత్తెన్న కల్యాణోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - అన్నవరం

అన్నవరం రత్నగిరిపై సత్తెన్న కల్యాణోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం నాలుగు గంటలకు అణివేటి మండపం వద్ద స్వామి, అమ్మవార్లను పెండ్లి కమారుడు, పెండ్లి కుమార్తెలను చేవారు. గణపతి తదితర పూజలు నిర్వహించారు. పేరంటాళ్లకు వాయినాలు అందించారు. రాత్రి ఏడు గంటలకు స్వామి, అమ్మవార్లను రాజా వెంకట రామరాయ కళామందిరంలో ఎదుర్కోలు ఉత్సవాన్ని నిర్వహించారు. రాత్రి తొమ్మిది గంటలకు పెండ్లి పిలుపుల నిమిత్తం శ్రీ సీతారాముల వారిని ఆంజనేయ వాహనంపై ఊరేగిస్తూ గ్రామోత్సవం నిర్వహించారు. దేవస్థానం ఇఒ ఎస్.ఆజాద్, పాలకమండలి సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను నిర్వహించారు. కల్యాణోత్సవాల సందర్భంగా దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. వేలాది మంది భక్తులు సందర్శించారు. పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. ఆలయానికి వచ్చే భక్తులక ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టామని ఇఒ తెలిపారు.



పెళ్లి కుమారుడు, కుమార్తె అలంకరణలో సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవారి విగ్రహాలు

వేసవి సెలవుల్లోనే బదిలీలు, ప్రమోషన్లు జరపాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి వేసవి సెలవుల్లోనే బదిలీలు, ప్రమోషన్లు నిర్వహించాలని యుటిఎఫ్ డిమాండ్ చేసింది. సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు పి.జయకర్ అధ్యక్షతన నగరంలోని యుటిఎఫ్ హోమ్‌లో జరిగింది. జయకర్ మాట్లాడుతూ మన్యం, పార్వతీపురం జిల్లాలో ఉపాధ్యాయుల,విద్యా శాఖ అధికారుల అక్రమ సస్పెన్షన్‌లకు వ్యతిరేకిస్తూ ఉపాధ్యాయులు చేసిన పోరాటం సంఘ పోరాట స్ఫూర్తికి అద్దం పట్టిందన్నారు. అక్రమాలకు వ్యతిరేకంగా పోరాటంలో ఉపాధ్యాయులు రాష్ట్ర వ్యాప్తంగా ముందుకు కదలాలి అన్నారు. ప్రధాన కార్యదర్శి ఎ.షరీఫ్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలపై ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాలతో చర్చించకుండా ఏకపక్షంగా వెళ్లడం వలన అడ్డంకులు వస్తున్నాయన్నారు. చివరకు బదిలీల జిఒలు రద్దు చేయాల్సి వచ్చిందన్నారు. విద్యా సంవత్సరం మధ్యలో బదిలీలు, ఉద్యోగోన్నతులు చేసి విద్యార్థులను, ఉపాధ్యాయులను ఇబ్బంది పెట్టకుండా వేసవి సెలవుల్లోనే నిర్వహించాలి డిమాండ్ చేశారు. నాణ్యమైన బ్యాగ్‌లు, బూట్లు, పుస్తకాలు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సహాధ్యక్షులు రాంబాబు, విజయగౌరి, కోశాధికారి ఇవిఎస్ఆర్.ప్రసాద్, కార్యదర్శులు డివివి.సత్యనారాయణ, ఎన్.రవిబాబు, రమేష్‌బాబు, శ్రీమణి, ఎం.రవి, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో ఎంఎల్‌ఎ తలారి సమీక్ష

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లి క్యాంపు కార్యాలయంలో పలు శాఖల అధికారులతో ఎంఎల్‌ఎ తలారి వెంకట్రావు ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో వ్యవసాయ శాఖ అధికారులు, సివిల్ సప్లయిస్ అధికారులు, మూడు మండలాల ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు. ధాన్యం కొనుగోలు సమస్యలు, పరిష్కార మార్గాలపై అధికారులతో ఎంఎల్‌ఎ చర్చించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా అధికారులు చూసుకోవాలన్నారు. అనంతరం దేవరపల్లిలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులకు ఎంఎల్‌ఎ తలారి వెంకట్రావు శంకుస్థాపన చేశారు. ఎంఎల్‌ఎ మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కెవికె.దుర్గారావు, వైసిపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి - గోపాలపురం

టాలెంట్ టెస్ట్‌లో విజేతలకు ఎంఎల్‌ఎ తలారి వెంకట్రావు చేతులమీదుగా ఆదివారం బహుమతులు అందించారు. గోపవరంలో కీర్తిశేషులు యండపల్లి, రమామణి, యండపల్లి వెంకటరత్నం దంపతుల మెమోరియల్ టాలెంట్ టెస్ట్‌ను వారి కుమారుడు సర్పంచ్ యండపల్లి శేఖర్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బహుమతుల ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. ఎంఎల్‌ఎ తలారి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఇటువంటి టాలెంట్ టెస్ట్‌లతో విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించొచ్చన్నారు. తల్లిదండ్రుల జ్ఞాపకార్థం టాలెంట్ టెస్ట్ నిర్వహించిన సర్పంచ్ శేఖర్‌బాబు, ఆయన సతీమణి వైసిపి మండల మహిళా అధ్యక్షులు యండపల్లి కవిత దంపతులను ఎంఎల్‌ఎ అభినందించారు. అనంతరం ఎంఎల్‌ఎను సన్మానించారు. కార్యక్రమంలో గోపాలపురం అగ్రికల్చరల్ మార్కెట్ కమిటీ చైర్మన్ జి.జనార్ధనరావు, అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, ఎంపిపి ఉండవల్లి సత్యనారాయణ, జడ్‌పిటిసి సభ్యులు కాకులపాటి లలిత తదితరులు పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి-దేవరపల్లి

కురుకూరులో కురిసిన అకాల వర్షానికి నష్టపోయిన వరి, అరటి, మొక్కజొన్న, జీడిమామిడి రైతులను మాజీ ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు పరామర్శించారు. వర్షానికి పాడైన పంటలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. అరటి పంటకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. తడిసిన వరికి, ఇతర పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలన్నారు.

'తిరుమల' ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం తిరుమల విద్యాసంస్థల ఆవరణలో 6, 7, 8, 9, 10వ తరగతుల్లోకి ప్రవేశించే విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఐఐటి, ఎన్ఐటి, మెడికల్ కాలేజీల్లో ప్రవేశ పరీక్షలపై అవగాహనా సదస్సు జరిగింది. ఈ సదస్సుకు సుమారు 12 వేల మంది హాజరయ్యారని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. పిల్లల భవిష్యత్ నిర్మాణంలో తల్లిదండ్రులు, స్కూలు ప్రముఖ పాత్ర వహిస్తాయన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఇంజినీరింగ్, వైద్యవిద్యల్లో విజయం సాధించాలంటే విలువలతో కూడిన చదువు అవసరమన్నారు. పిల్లల భవిష్యత్తు గురించి అహర్నిశలు ఆలోచించే తల్లిదండ్రులు వారికి ఆస్తులను అందివ్వడం ముఖ్యం కాదన్నారు. పిల్లల భవిష్యత్తుకు అమోఘమైన మార్గాన్ని చూపిస్తూ ఉన్నత విద్యను అందించాలన్నారు. నేటి కాలంలో పిల్లల బాహ్యప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనించుకోవాలన్నారు. తద్వారా సమగ్ర మానసిక పరిపక్వత, విలువలతో కూడిన జీవన విధానం పిల్లలు నేర్చుకుంటారని ఆయన తెలిపారు. తిరుమల



మాట్లాడుతున్న తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు

విద్యాసంస్థల డైరెక్టర్ నున్న సరోజినీదేవి మాట్లాడుతూ కుటుంబ వ్యవస్థ అనేది మంచి సమాజం ఏర్పడడానికి కారణం అవుతుందన్నారు. అది కేవలం అమ్మ ద్వారా మాత్రమే సాధ్యమవుతుందన్నారు. పిల్లల ఎదుగుదల, అభివృద్ధిలో తల్లి పాత్ర వెలకట్టలేనిదన్నారు. ప్రతీ తల్లి తమ పిల్లలకు విలువలతో కూడిన విద్యను అందించే ప్రయత్నం చేయాలని తెలిపారు. ఈ సదస్సులో అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్బాబు, ప్రిన్సిపల్ వి.శ్రీహరి, విద్యార్థుల తల్లిందండ్రులు మాట్లాడారు.

ఇంధన పొదుపు సామాజిక బాధ్యత

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఇంధన పొదుపు ఒక సామాజిక బాధ్యత కావాలని గెయిల్ ఇండియా జనరల్ మేనేజర్ బి.మొహంతి అన్నారు. స్థానిక ఎస్‌కెవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు గెయిల్ ఇండియా ఆధ్వర్యంలో చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మొహంతి మాట్లాడారు. మానవులు సహజ సంపదలుగా ఉన్న చమురు, గ్యాస్‌లను విచ్చలవిడిగా వాడేస్తూ పర్యావరణానికి పరోక్షంగా హాని చేస్తున్నారన్నారు. ఇదే ధోరణి కొనసాగితే రానున్న రోజుల్లో ఇంధనం దొరక్క అనేక సమస్యలు ఎదుర్కొంటామన్నారు. ఇంధన పొదుపు ఒక సామాజిక బాధ్యత కావాలని, అవసరం మేరకు మాత్రమే వాహనాలను వాడాలన్నారు. గెయిల్ సీనియర్ మేనేజర్(కమ్యూనిటీ సోషల్ రెస్పాన్సిబిలిటీ) మాట్లాడుతూ విద్యార్థుల్లో ఇంధన పొదుపుపై అవగాహన కల్పించే నిమిత్తం చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న అర్బన్ రేంజ్ డిఐ బి.దిలీప్‌కుమార్ మాట్లాడుతూ గెయిల్ ఇండియా వారు సామాజిక బాధ్యతగా విద్యా శాఖకు సహకారాన్ని అందిస్తూ ప్రోత్సహిస్తున్నారన్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు డ్రాయింగ్ కిట్‌లను బహుమతిగా అందించారు. ఈ కార్యక్రమంలో గెయిల్ సెక్యూరిటీ ఆఫీసర్ పి.సాగర్, హెచ్‌ఎంలు ఎంవిఎం.సుబ్రహ్మణ్యం, డ్రాయింగ్ టీచర్లు పుప్పాల బాపిరాజు, వరహా గిరికృష్ణమోహన్, సిఆర్‌పి జయంతిశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవల్లో బిఎంపిల పాత్ర కీలకం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలందించడంలో బేసిక్ మెడికల్ ప్రొవైడర్స్ పాత్ర కీలకమని రాజమండ్రి ఫస్ట్ ప్లస్ హాస్పిటల్ అధినేత డాక్టర్ కళాధర్ రెడ్డి అన్నారు. స్థానిక లారీ వర్కర్స్ కార్యాలయ ఆవరణలో బిఎంపి అసోసియేషన్ ఏలేశ్వరం యూనిట్ సమావేశం ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కళాధర్ రెడ్డి మాట్లాడుతూ బిఎంపిలు ఎప్పటికప్పుడు ప్రాథమిక వైద్యంపై శిక్షణ పొందాలన్నారు. సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు వివి.కృష్ణారావు మాట్లాడుతూ ప్రభుత్వం జిఒ 429 పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యదర్శి సిరికి శ్రీనివాస్ మాట్లాడుతూ బిఎంపిలు సర్టిఫికెట్లను రెన్యువల్ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ యూనిట్ నాయకులు ఆర్.శ్యామ్ కుమార్, వి.వీరభద్రరావు, ఎస్‌కె.ఆశిక్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను ఉపయోగించుకోవాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

పేదల ఆరోగ్యం కోసం వివిధ గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని ప్రముఖ న్యూరో వైద్యులు గుడ్ల సతీష్ అన్నారు. ఆదివారం మోర్తలో ఆర్‌ఎంపి చిటకన రాంబాబు ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మోర్త సర్పంచ్ చిటకన సుజిని, తాడిపర్రు సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

వేగేశ్వరపురంలో వైద్యశిబిరం

తాళ్లపూడి వేగేశ్వరపురంలో మేరీ మాత ఉత్సవాల సందర్భంగా ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. దేవాలయ డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ టి.జాన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వైద్య శిబిరంలో రాజమహేంద్రవరానికి చెందిన ఎఆర్‌కె ఎమర్జెన్సీ అండ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ పితాని రామకృష్ణ వైద్యసేవలందించారు.

'ఆదిరెడ్డి' కుటుంబంపై సిఐడి

(మొదటి పేజీ తరువాయి)

కేసులు చుట్టుకుంటున్నాయి. బాబాయ్ హత్య కేసు గురించి తెలిసిందే.అవినాష్ రెడ్డి అరెస్టు చేస్తారనే భయం వెంటాడుతోంది. డైవర్షన్ పాలిటిక్స్ చేసేందుకు అరాచకాలకు పాల్పడుతున్నారు. ఫాక్షన్ మెంటాలిటీని ప్రతి ఒక్కరూ ఖండిస్తున్నారు. ఈ ముఖ్యమంత్రికి బిసిల దెబ్బ ఏమిటో చూపిస్తాం. ఆదిరెడ్డి అప్పారావు అనేక సంవత్సరాలుగా బీసీ సంఘాలలో యాక్టివ్‌గా పని చేశారు. ఎంఎల్‌ఏ ఆదిరెడ్డి భవాని తండ్రి ఎర్రన్నాయుడు కేంద్ర మంత్రిగా సేవలందించారు. భయభ్రాంతులకు గురి చేయాలని చూస్తే భయపడేది లేదు.

అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నాం. మాజీ మంత్రి జవహర్

మాజీ ఎంఎల్‌సి ఆదిరెడ్డి అప్పారావు, ఆదిరెడ్డి వాసుల అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నాం. తెలుగుదేశం పార్టీ పూర్గిగా అండగా ఉంటుంది. కావల్సిన లీగల్ సాయం అందజేస్తుంది. ఈ వేధింపుల వల్ల జగన్మోహనరెడ్డే నష్టపోతారే తప్ప టిడిపీ కి ఏమి కాదు. ఇది మానవ హక్కుల ఉల్లంఘన, తీవ్రంగా ఖండిస్తున్నాం. జగన్మోహనరరెడ్డి దుర్మార్గాలను ప్రజల్లోకి తీసుకెళతాం.

మహానాడును భగ్నం చేయాలనే దురుద్దేశంతోనే : మాజీ ఎంఎల్‌ఏ నల్లమిల్ల రామకృష్ణా రెడ్డి

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కుటుంబం యావత్తు కేసులలో చిక్కుకుని అప్రతిష్ట పాలైంది. సొంత బాబాయిని హత్య చేసిన కేసులో అంతపురాన్ని సిబిఐ దోషిగా నిలబెడుతోంది. దీనిని తప్పించుకునే కార్యక్రమం జరుగుతోంది. ప్రజల్లో ఆ చర్చను పక్కదారి పట్టించేందుకు ఇటువంటి అక్రమాలకు పాల్పడుతున్నారు.ఈ నెల 27, 28 తేదీలలో జిల్లాలో జరగబోయే మహానాడును ఏ విధంగా అయినా భగ్నం చేయాలనే దురుద్దేశంతో అరెస్టులు చేశారు. దీనిని తెలుగు దశం పార్టీ తరుపున తీవ్రంగా ఖండిస్తున్నాం.

లయన్స్ క్లబ్ అధ్యక్షునిగా 'పుల్లా' ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి- కడియం

లయన్స్ క్లబ్ రాజమండ్రి కడియం హార్టికల్చర్ అధ్యక్షునిగా సత్యదేవా నర్సరీ అధినేత లయన్ పుల్లా ఆంజనేయులు(అబ్బులు) ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆంజనేయులు బాధ్యతలు చేపట్టారు. అలాగే చార్టర్ సెక్రటరీగా పంతం గణపతి, ట్రెజరర్‌గా నక్కా అమ్మిరాజు, ఉపాధ్యక్షులుగా బొర్సు సుబ్బారాయుడు, పుల్లా చిన సత్యనారాయణ ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. సర్జరీలకు 15 మందిని గుర్తించారు. లయన్స్ క్లబ్ ద్వారా వారికి సర్జరీలు ఉచితంగా చేయిస్తామని నూతన కమిటీ పేర్కొంది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా మాటూరి మంగతాయారు, డాక్టర్ బాదం బాలకృష్ణ, అనిల్‌కుమార్, బివిఎన్.రెడ్డి, వి.సూర్యనారాయణ, జిల్లా ఉద్యాన అధికారి వి.రాధాకృష్ణ, కడియం ఉద్యాన అధికారి డి.సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

3వేల మందికి అన్నదానం

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లిలో వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో 3వేల మందికి అన్నదానం చేశారు. దేవరపల్లి విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం కామాక్షి విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వీరబ్రహ్మేంద్రస్వామి గోవిందమాంబలకు పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.



ఎన్‌పిఆర్‌కు సత్కారం చేస్తున్న దృశ్యం

పరమేశ్వరరావుకు సన్మానం

ప్రజాశక్తి - తాళ్లపూడి

తాళ్లపూడి గ్రామదేవత మోదుగులమ్మ జాతరను ఘనంగా నిర్వహించడానికి సహకరించిన ప్రజలకు అధికారులకు ఎంతో రుణపడి ఉన్నానని ఉత్సవ కమిటీ అధ్యక్షులు, మాజీ సర్పంచ్ నామన పరమేశ్వరరావు అన్నారు. జాతరను విజయవంతంగా పూర్తి చేసినందుకు ఎన్‌పిఆర్ యూత్ ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద గల ఆలయాల ప్రాంగణంలో ఆదివారం పరమేశ్వరరావును ఉత్సవ కమిటీ సభ్యులను ఘనంగా సత్కరించారు. ఆలయ ప్రధాన అర్చకులు గోవర్ధనం చక్రవర్తి పరమేశ్వరరావును పూలమాలలతో సత్కరించారు. పరమేశ్వరరావు మాట్లాడుతూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు బందోబస్తు నిర్వహించిన పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.

గ్లాసుల అందజేత

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాష్ట్ర ప్రభుత్వం జగనన్న గోరుముద్దలో భాగంగా విద్యార్థులకు రాగి జావను ప్రవేశపెట్టిందన్నారు. ఇందులో భాగంగా రాగి జావ తాగేందుకు వీలుగా స్టీల్ గ్లాస్‌లను హెచ్‌ఎంలకు అందించామని అర్బన్ రేంజ్ డిఐ బి.దిలీప్‌కుమార్ తెలిపారు.. ప్రధానోపాధ్యాయులు గ్లాస్ లను స్టోర్ రూమ్ లో భద్రపరచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, సి ఆర్ పి లు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి బ్రోకెన్ మెషిన్

ప్రజాశక్తి- కడియం

రైతుల కోరికపై కడియం తహశీల్దార్ కార్యాలయంలో బ్రోకెన్ మెషిన్ (ధాన్యంలో నూక శాతం నిర్ధారణ చేసే మెషీన్) సివిల్ సప్లయిస్ అధికారుల సహకారంతో ఆదివారం అందుబాటులోకి తీసుకుకొచ్చామని తహశీల్దార్ సుజాత తెలిపారు. సదుపాయాన్ని రైతులు వినియోగించుకోవా లన్నారు.

మొబైల్ వాటర్ ట్యాంక్‌కు విరాళం

ప్రజాశక్తి - గోపాలపురం

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మొబైల్ వాటర్ ట్యాంక్ ఏర్పాటుకు దాతలు విరాళాలు అందించడం అభినందనీయమనిమానవత సంస్థ మండల చైర్మన్ జొన్నగడ్డల రాంబాబు అన్నారు. వాదాలకుంట గ్రామానికి చెందిన ఉండవల్లి సుభాష్‌చంద్రబోస్ రూ.35వేలు, జొన్నలగడ్డ రాంబాబు, గెడా జోగేంద్ర ప్రసాద్, ఉండవల్లి రామకృష్ణ, కాకర్ల శ్రీరామ్, ఉండవల్లి గాంధీ, ముళ్లపూడి జై రామ్ రూ.5వేలు చొప్పున విరాళం ఇచ్చారన్నారు. మొత్తం రూ.65 వేలను రాంబాబుకు అందజేశారు.

దాతల సహకారం మరువలేనిది

ప్రజాశక్తి - తాళ్లపూడి

తమ సంస్థ ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలకు దాతలు అందిస్తున్న సహాయ సహకారాలు మరువలేనివని చిడిపి దేవోక్తి సోషల్ సర్వీస్ అధ్యక్షులు ప్రత్తిపాటి అభేగ్నేడ్ అన్నారు. రాజమండ్రిలోని రుతు వృద్ధుల ఆశ్రమం, అమ్మ అంధ వికలాంగుల ఆశ్రమం, పుష్కర ఘాట్ వద్ద సుమారు 100 మందికి ఆదివారం భోజనాలు అందించినట్లు ఆయన తెలిపారు. తాళ్లపూడిలోని మంగన్న సర్జికల్స్ అండ్ మెటర్నిటీ నర్సింగ్ హోం డాక్టర్ మూర్తి దీనికి ఆర్థిక సాయం అందించారని తెలిపారు.

అభ్యుదయ కవిత్వానికి నాంది పలికిన శ్రీశ్రీ

మహాకవి, ప్రజాకవి శ్రీశ్రీ తెలుగులో అభ్యుదయ కవిత్వానికి నాంది పలికారని పలువురు కొనియాడారు. శ్రీశ్రీ జయంతి సందర్భంగా ఆదివారం పలుచోట్ల ఆయనకు ఘనంగా నివాళులర్పించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

సామర్లకోట రూరల్ మండలం మాధవపట్నం జమునానగర్‌లో అంగర లక్ష్మీకాంతం ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలమందిరంలో శ్రీశ్రీ జయంతి ఘనంగా నిర్వహించారు. కన్వీనర్ అంగర గోపాలకృష్ణ (కృష్ణశ్రీ) మహాప్రస్థానం పుస్తకంలోని కొన్ని కవితలను విద్యార్థులతో చదివించారు. **తాళ్లరేవు** ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఎలిపే నాగేశ్వరరావు అధ్యక్షతన శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజుబాబు, ఉంగరాల వెంకటేశ్వరరావు, సలాది సత్తిబాబు, అత్తిలి బాబూరావు, పెయ్యల రమేష్, పలివెల సింహాచలం, ఈశ్వరరావు, దుప్పి అదష్టదీపుడు, పాలెపు ఈశ్వరరావు, సింగవరపు ప్రసాద్, గుత్తుల మల్లేశ్వరరావు, పాల్గొన్నారు. **రాజమహేంద్రవరం** ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జిల్లా శాఖ ఆధ్వర్యంలో గోరక్షణపేటలో 113వ జయంతి ఘనంగా నిర్వహించారు. అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఆర్.పథ్వి శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.


శ్రీశ్రీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సాహితీ సవ్రంతి

అరసం జిల్లా అధ్యక్షులు పడాల వీరభద్రరావు, డిఎ లింకన్, బత్తుల సూర్యప్రకాశరావు, లోలబట్టు శ్రీనివాసరావు, మాదేటి రవిప్రకాష్, ముప్పన కుమారస్వామి, యర్ర కష్ణ కుమార్ పాల్గొన్నారు. **కడియంలో** ఎంఇఒ వి.లజపతిరాయ్, సాహితీవేత్త తోరాటి వసంతరావు, ఫిలాంత్రపిక్ సొసైటీ అధ్యక్షులు అద్దంకి రాజాయోనా, చెళ్లపిళ్ల వేంకట శాస్త్రి కళా సేవాసమితి అధ్యక్షుడు అడపా సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. చిలుకూరి శ్రీనివాసరావుకు అవార్డు అందించి ఘనంగా సత్కరించారు. గ్రంథాలయ అధికారి శ్రీదేవి, ఉపాధ్యాయులు పితాని సత్యనారాయణ, కె.శ్రీనివాసరావు, కళాకారులు బొర్రా రామకష్ణ, ఐ.నరసింహ, తూలూరి సుబ్బారావు పాల్గొన్నారు. **పెద్దాపురం** సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జోస్యుల కష్ణ బాబు ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో చల్లా విశ్వనాథం, మార్ని జానకిరామ్, కొత్త శివ, సాయి, వంగలపూడి శివకష్ణ, చల్లా దుర్గాప్రసాద్, దారపురెడ్డి కృష్ణ, రొంగల వీర్రాజు, దారపురెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

నేటి నుంచి సమ్మర్ క్యాంప్

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

మాధవపట్నం గ్రామం జమునానగర్ కాలనీలో అంగర లక్ష్మీకాంతం ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో బాల మందిరంలో మే 1 తేదీ నుంచి 8వ తేదీ వరకూ సమ్మర్ క్యాంప్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ట్రస్టు కన్వీనర్ అంగర గోపాలకృష్ణ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 1న మ్యాజిక్‌పై రిసోర్స్‌పర్సన్ బుద్ధా శ్రీనివాసు శిక్షణను ఇస్తారన్నారు. 2న ఒరిగామిపై శిక్షణను రిసోర్స్‌పర్సన్ సత్యవేణి, 3న జీవన నైపుణ్యాలపై రిసోర్స్‌పర్సన్ అద్దేపల్లి ఉదయ్ భాస్కర్, డి.సుబ్రహ్మణ్యం, 4న హ్యాండ్ రైటింగ్ స్కిల్స్ అండ్ స్టడీ స్కిల్స్‌పై రిసోర్స్‌పర్సన్ సిసిఆర్‌టి ప్రసాద్, 5న సైన్స్‌షోపై రిసోర్స్‌పర్సన్ కె.కృష్ణసాయి, 6న పప్పెట్రీ పై రిసోర్స్‌పర్సన్ పిల్లి గోవిందరాజు, 7న సరదా సైన్సు అంశంపై రిసోర్స్‌పర్సన్ బివి.సత్యనారాయణ, 8న నెంబర్ వన్ విద్యార్థి కావడం ఎలా? అనే అంశంపై రిసోర్స్‌పర్సన్ నోరి బల రామ కృష్ణలు శిక్షణ ఇస్తారన్నారు. అలాగే ఇంకా కథలు రాద్దాం, చిత్ర లేఖనం, భాషా నైపుణ్యాలు, న్యూస్ రీడింగ్, ఆట లు మొదలైన అంశాలపై శిక్షణ, అవగాహన తరగతులు కూడా నిర్వహిస్తారని అన్నారు.

ఆదిరెడ్డి అప్పారావు, వాసుల అరెస్ట్‌కు ఖండన

ప్రజాశక్తి-అయినవిల్లి

మాజీ ఎంఎల్‌సి ఆదిరెడ్డి అప్పారావు, రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి అదిరెడ్డి వాసులను సిఐడి అదుపులోకి తీసుకోవడం దుర్మార్గమని, సిఐడి చర్యలను రాష్ట్ర బిసి సాధికార ఎంబిసి కన్వీనర్ పెంద్రరమేష్ ఆదివారం ఒక ప్రకటలో ఖండించారు. ఆయన ఇదంతా కూడా రాజ మహేంద్రవరంలోని జరగబోయే మహా నాడును అడ్డుకునేందుకే వైసిపి ప్రభు త్వం పన్నుతున్న కుట్ర తప్ప మరేమి కాదన్నారు. వైసిపి ప్రభుత్వం బిసిల మీద చేస్తున్న అరాచకం మరొకసారి బయటపడిందన్నారు. బిసిలను వైసిపి ప్రభుత్వం తీవ్రంగా అణిచివేతకు గురి చేస్తోందన్నారు **కొత్తపేట** మాజీ ఎంఎల్‌సి ఆదిరెడ్డి అప్పారావు, రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి వాసులను సిఐడి అరెస్ట్ చేయడం రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగమే నాని జిల్లా టిడిపి అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి అన్నారు. ఆయన ఆదివారం విలేకరులతో మట్లాడుతూ సుమారు 35 సంవత్సరాలుగా జగజ్జనని పేరిట అదిరెడ్డి అప్పారావు చిట్ ఫండ్ కంపెనీని నడుపుతున్నారని అన్నారు. ఇప్పటి వరకు ఈ కంపెనీపై ఆరోపణలు లేవన్నారు.


సాయం అందజేస్తున్న అగ్నికులక్షత్రియ సంఘం

అకాలవర్షంతో ఇబ్బందులు

ప్రజాశక్తి-మండపేట

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆదివారం తెల్లవారుజామున కురిసిన అకాల వర్షానికి రైతులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. గాలికి వరి నేలకొరిగింది. పలు ప్రాంతాల్లో ఆరబెట్టుకున్న ధాన్యం తడిచిపోవడంతో ధాన్యాన్ని ఆరబెట్టుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. ఇదే


చెరువులను తలపిస్తున్న ఏడిద రోడ్డు


మండపేటశివారు ప్రాంతాల్లోనేలకొరిగిన వరి

పరిస్థితి కొనసాగితే ఈ ఏడాది కూడా నష్టపోక తప్పదని రైతులు ఆందోళన చెందుతున్నారు. సుమారు రెండు గంటల పాటు కురిసిన గాలి వానకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. లోతట్టు ప్రాంతాలు రోడ్లు జలమయమయ్యాయి. మండపేట - ఏడిద రోడ్డు చెరువులను తలపించింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

సేవా కార్యక్రమాల్లో లయన్స్ ముందంజ

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఉన్నత సేవా కార్యక్రమాలతో రాష్ట్రంలోనే లయన్స్ క్లబ్‌ను ముందు వరుసలో నిలబెట్టడానికి తన వంతు కషి చేస్తానని నూతన జిల్లా గవర్నర్ వేలూరి సూర్యనారాయణ అన్నారు. ఈ నెల 23న రాజమండ్రిలో నూతన గవర్నర్‌గా ఎన్నికైన సందర్భంగా తాళ్లరేవు సూర్య భాస్కర్ కళ్యాణ మండపంలో ఆదివారం జిల్లా గవర్నర్ రిప్రజెంటేటివ్ నడింపల్లి వినోద్ అధ్యక్షతన కమిటీ పరిచయ సమావేశంలో వేలూరి సూర్యనారాయణ మాట్లాడారు. ఈ ఏడాది కేర్ అనే నినాదంతో 2023-2024 అందరి సహకారంతో సేవా కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రస్తుత గవర్నర్ మాటూరి మంగతాయారు, పూర్వపు గవర్నర్లు నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ



కార్యక్రమంలో పాల్గొన్న లయన్స్ సభ్యులు తదితరులు

కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు బాదం బాలకష్ణ, మంజులూరు విశ్వేశ్వరరావు, బివిఎన్.రెడ్డి మాట్లాడారు. జిల్లా ఫస్ట్ వైస్ గవర్నర్ ఎబివి.ఈశ్వర్ కుమార్, సెకండ్ వైస్ గవర్నర్ వజ్రపు కోటేశ్వరరావు, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రటరీ గాదిరాజు సతీష్, క్యాబినెట్ ట్రెజరర్ నున్న దత్తు, జాయింట్ క్యాబినెట్ సెక్రటరీ చోడే మాలతి వసుంధర జాయింట్ ట్రెజరర్ దూలిపూడి వెంకటరమణ, జోన్ చైపర్సన్ బిళ్ళకుర్తి శ్రీనివాసరెడ్డి ,జిల్లా నుంచి 40 క్లబ్బుల సభ్యులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితురాలికి సాయం

ప్రజాశక్తి-రాజోలు

సొంపల్లి గ్రామం బోన్ క్యాన్సర్‌తో బాధపడుతున్న మసకపల్లి అలేఖ్యకు రాజోలు తాలూకా అగ్నికులక్షత్రియ సేవా సంఘం వారు రూ.18వేలు ఆర్థిక సాయం అందజేశారు. రాష్ట్ర అగ్నికులక్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ బొమ్మిడి వెంకటేష్, రాజోలు మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొమ్మిడి దుర్గా భవాని మహేష్ చేతుల మీదుగా ఈ సాయాన్ని ఆదివారం బాధితురాలికి అందచేశారు. ఈ కార్యక్రమంలో సంఘ సొసైటీ ప్రెసిడెంట్ బొమ్మిడి సత్యనారాయణ, కోనసీమ అగ్నికులక్షత్రియ గౌరవ అధ్యక్షులు కర్రి స్వామినాథ్, కువైట్ ఎన్నారై అగ్నికుల క్షత్రియ సేవాసంఘం తారాడి శివ పాల్గొన్నారు.


మట్టే సోదరులను అభినందిస్తున్న దృశ్యం

లలిత ఇండస్ట్రీస్ అధినేతలకు అభినందన

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం శ్రీ లలిత ఇండస్ట్రీస్ అధినేతలు మట్టే సత్య ప్రసాద్, మట్టే శ్రీనివాస్‌లు స్థానిక ఏరియా ప్రభుత్వాసుపత్రికి రూ.20 లక్షల విలువచేసే సామగ్రిని అందజేసినందుకు ఆది వారం జనసేన నియోజకవర్గ ఇన్చార్జి తుమ్మల రామస్వామి ఆధ్వర్యంలో వారిని అభినందించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పిట్టా జానకి రామయ్య, కొప్పిరెడ్డి నాగబాబు, చిటికెల నారాయణమూర్తి, రాజన్న,పెన్నాడ అన్నవరం,పెంకే వెంకటలక్ష్మి, కర్రి అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధకు కృషి

ప్రజాశక్తి-కొత్తపేట

అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపిపి మార్గాన గంగాధర్, అమలాపురం అడా ఛైర్మన్ గొల్లపల్లి డేవిడ్ రాజ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పలివెల చిన్నపేటలో ఆదివారం అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ జరిగింది.


కార్యక్రమంలో పాల్గొన్న ఎంపిపి తదితరులు

కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు గునిపే శ్యామల, కొత్తపేట గ్రామ సర్పంచ్ బూసి విజయలక్ష్మి, పలివెల పంచాయితీ సర్పంచ్ సాదే లక్ష్మి, వార్డు సభ్యులు, గీత కార్మిక ప్రెసిడెంట్ మార్గాన సత్యనారాయణ, బిళ్ళకుర్రు సర్పంచ్ నెల్లి లక్ష్మీపతి, వానపల్లి సర్పంచ్ పల్లి భీమరావు తదితరులు పాల్గొన్నారు..

ధాన్యం సేకరణలో వైసిపి ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి - ఆలమూరు

ధాన్యం సేకరణలో వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫల మైందని జిల్లా తెలుగు రైతు అధికార ప్రతినిధి ఈదల సత్తిబాబు, మండల తెలుగు రైతు అధ్యక్షుడు గొడవర్తి దుర్గాప్రసాద్‌లు విమర్శించారు. వారు ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ రబీ ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో రైతులు అవస్థలు పడుతున్నారని అన్నారు. రబీ ధాన్యం సేకరణలో ఐదు శాతం కటింగ్ మిల్లర్లకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడం ద్వారా అన్నదా తలను నిండా ముంచేసిందని వారు విమర్శిం చారు. దీనితో రైస్ మిల్లర్లు బస్తాకు సుమారు రూ.100 వరకు కోత పెడుతూ ఉండడంతో రైతు నష్టపోతున్నాడని వారు అన్నారు. ఒకపక్క అకాల వర్షాలు మరోపక్క ప్రభుత్వం అనుసరిస్తున్న అస్తవ్యస్త విధానాలు రైతులు పండించిన పంటను అమ్ము కోవడానికి సైతం అష్ట కష్టాలు పడేలా చేస్తున్నాయని వారు అన్నారు. టిడిపి రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధి దండంగి మమత, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

తూ॥గో॥జిల్లా రాజమహేంద్రవరం D.No.:42-10-6 Kothapeta Street లో నివసిస్తున్న K.Srinivas అను నా యొక్క రాజమండ్రికి చెందిన దస్తావేజు **నెం:1368/22** నెంబరు గల ఆస్తికి సంబంధించిన లింక్ దస్తావేజులు అయిన **1).5717/12 2) 4024/12 3) 3313/15 4) 191/15, 5)1638/716)1008/85** మరియు బిల్డింగ్ ప్లాన్ తీసుకొని నా బైక్‌పై **ది.28-4-2023** తేదీన కాకినాడలో నాకు తెలిసిన S.V.S. శర్మ గారితో సదరు గొలుసుకట్టు దస్తావేజులు చదివించుకుని తిరుగు ప్రయాణంలో వచ్చుచుండగా కరకుదురు, పెద్దపూడిమీదుగా గొల్లెలమామిడాడ లో గల రామాలయం దర్శించుకుని సాయంత్రం 6గం॥ల సమయంలో గుడి వద్ద నుండి కిలోమీటరు వెళ్ళుచుండగా దస్తావేజులతో గల ప్లాస్టిక్ బ్యాగ్ బైకు హుక్కు నుండి జారి పడిపోయినది. కావున సదరు దస్తావేజులు ఎవరికైనా దొరికిన యెడల ఈ ఫోన్ నెంబర్‌కి తెలియపర్చ వలసిందిగా కోరుచున్నాను.

ఫోన్ : 0883 2476739

'జగనన్న బడుగు వికాసం'లో సబ్సిడీపై బస్సులు

ప్రజాశక్తి-రావులపాలెం

దళితుల్ని పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలన్న ఉద్దేశ్యంతో సిఎం జగన్ చేపట్టిన జగన్నన్న బడుగు వికాశం పథకం పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌సిలకు సబ్సిడీపై బస్సులను అందిస్తోంది. ఇందులో భాగంగా రావులపాలెం మండలం ఈతకోటలోని ఎస్‌సి వర్గానికి చెందిన యువకుడు గెడ్డం అనిల్ కుమార్ కి రెండు బస్సులను సబ్సిడీపై అందజేశారు. లబ్ధిదారునికి ఇచ్చిన బస్సులను ఆదివారం ఈతకోట జెడ్‌పి పాఠశాల సమీపంలో వైసిపి ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షుడు కప్పల శ్రీధర్, గ్రామ సర్పంచ్ యర్రంశెట్టి సుబ్బలక్ష్మి జెండా ఊపి ప్రారంభించారు. శ్రీధర్ మాట్లాడుతూ జగనన్న బడుగు వికాసం పథకం బడుగుల జీవితాల్లో వెలుగు నింపుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యుడు వత్సవాయి హరిబాబు, చిక్కాల సత్యప్రసాద్, యర్రంశెట్టి సత్తిరాజు, గెడ్డం రాజ్ కుమార్, కుటుంబ సభ్యులు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.


బస్సు ప్రారంభిస్తున్న శ్రీధర్ తదితరులు



ఏ దేశపు చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం?
నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం

రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా

కార్మిక చట్టాల్లో సవరణలు



అంబేద్కర్ జీవితం, ఆయన రచనలు, రాజ్యాంగంలో ఆయన పొందుపర్చిన అంశాలను ఒక్కొక్కటిగా ఒదిలేస్తూ రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నమైన పాలన సాగిస్తూ భారత రాజ్యాంగం, భారత పార్లమెంటు ద్వారా చేసిన కార్మిక చట్టాలు, అందులో కార్మికులకు ఉద్యోగ భద్రత, ఇతర సదుపాయాలను తొలగిస్తూ సవరణలు చేస్తున్నారు. 1942 నుండి 1946 వరకు అంబేద్కర్ బ్రిటీష్ వైశ్రాయి కౌన్సిల్‌లో లేబరు మెంబరుగా, కార్మిక ప్రతినిధిగా ఉన్నారు. ఆ కాలంలోనే ఆయనపై లేబర్ పాలసీ, కార్మిక చట్టాలు, కార్మిక సంక్షేమానికి సంబంధించిన అంశాలు ప్రభావితం చేశాయి. నిరుద్యోగం, అరకొర ఉపాధి వంటివి కార్మిక వర్గానికి పెద్ద శత్రువులుగా అంబేద్కర్ భావించారు. అందువల్లే రాజ్యాంగంలో సంపూర్ణ ఉపాధి అవకాశాలు, కార్మిక సంక్షేమానికి రాజ్యం (ప్రభుత్వం) కట్టుబడి ఉండేటట్లు రాజ్యాంగంలోని పలు అంశాలను రూపొందించారు.

కార్మికుల సంక్షేమానికి రాజ్యాంగంలో హామీ

దేశ కార్మిక పాలసీని నిర్ణయించడానికి బహుముఖ మార్గాలను దత్తత తీసుకున్నారు. కార్మికులు, సాంఘిక, సంక్షేమ పథకాలు, కార్మికుల ప్రయోజనాలకు భద్రత కల్పిస్తూ రాజ్యాంగంలో పలు అంశాలను పొదుపర్చారు. లేబరు పాలసీని నిర్ణయించేందుకు, కార్మికుల చట్టాలు అమలు చేసేందుకు, వివాదాలు పరిష్కరించేదుకు, ప్రభుత్వ యంత్రాంగాన్ని ఏర్పాటు చేసేందుకు యాజమాన్యాలకు సమాన అవకాశాలు కల్పించారు. అందుకనుగుణంగానే రాజ్యాంగంలో ఆర్టికల్స్ 38, 39, 41, 42, 43, 47లను పొందుపర్చారు. ప్రభుత్వం విధిగా ప్రజల సంక్షేమాన్ని ఉన్నత స్థాయికి పెంచాలని నిర్దేశించారు. ప్రజలకు న్యాయ, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో, అన్ని సంస్థల్లో, జాతీయ స్థాయిలో ఎఫెక్టివ్ ప్రొవిజన్స్ చేయాలని నిర్దేశించారు. కార్మికులందరికీ డీసెంట్, స్టాండర్డ్ ఆఫ్ లైఫ్, మెటర్నిటీ రిలీవ్, మానవత్వం, నీతిపరమైన పని పరిస్థితులు ఉండాలని, వారికి తగు రక్షణ కల్పించేలా ప్రొవిజన్స్ ఉండేలా చట్టాలు తీసుకురావాలని నిర్దేశించారు.

హక్కుల నుండి కార్మికుల మినహాయింపు

చట్టపరమైన చర్యల్లో భాగంగానే ఫ్యాక్టరీల చట్టం, ట్రేడ్ యూనియన్ యాక్ట్, పారిశ్రామిక వివాదాల చట్టం, ఇఎస్ఐ చట్టం, కనీస వేతనాల చట్టం, వేతనాల చెల్లింపుల చట్టం, ప్రావిడెంటు ఫండ్ చట్టం, కాంట్రాక్టు లేబర్ చట్టం వచ్చాయి. భారత రాజ్యాగం సంక్షేమ రాజ్యంగా ప్రజలకు అందుబాటులో ఉండాలని పోలీసు రాజ్యం కాకూడదని నిర్దేశించారు. అయితే ఈ చట్టాలను దేశవ్యాప్తంగా కార్మికులందరికీ వర్తింపజేయటానికి ప్రభుత్వాలు సమర్ధవంతమైన చర్యలు తీసుకోకపోగా, నూటికి 70 శాతం కార్మికులకు ఈ చట్టాలు వర్తించకుండా మినహాయింపునిస్తూ యజమానులకు అనుకూలంగా కార్మిక చట్టాలను తిరగతోడుతున్నాయి. చట్టాల సవరణ పేరుతో కార్మికులకు వర్తించకుండా కొన్ని సెక్షన్లను, నిబంధనలను అదనంగా చేర్చారు. ట్రేడ్ యూనియన్ యాక్టు ద్వారా ఏ సంస్థలోనైనా ఏడుగురు కార్మికులతో సంఘాన్ని రిజిస్టరు చేయించుకోవచ్చు. అయితే ఇప్పుడు 100 మంది కార్మికులు లేదా 10 శాతం కార్మికులు ఉంటేనే సంఘాన్ని రిజిస్టరు చేయాలని, గతంలో ఉన్న యూనియన్లలోనూ ఈ సంఖ్య తగ్గితే రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని సవరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో కొత్తగా యూనియన్లు పెట్టుకునే పరిస్థితి లేదు. ఉన్నవాటిని బతికించుకోవటం సమస్యగా మారింది.

ట్రేడ్ యూనియన్ ద్వారా కార్మికుల హక్కులు

1.కనీస వేతనాలు చట్టం 1948 సెక్షన్ 20 సబ్‌సెక్షన్ 2 ప్రకారం ఏ కార్మికుడైనా యజమాని నుండి తనకు రావాల్సిన బకాయిల కోసం యూనియన్ ద్వారా క్లెయిమ్ చేసుకోవచ్చు.

2. కార్మిక నష్టపరిహార చట్టం సెక్షన్ 24 ప్రకారం ఏ కార్మికుడైనా యజమాని నుండి తనకు రావాల్సిన పరిహారం కోసం యూనియన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

3.పారిశ్రామిక వివాదాల చట్టం సెక్షన్ 36 సబ్‌సెక్షన్ 1 ప్రకారం ఏ కార్మికుని తరపునైనా యూనియన్ పార్టీగా రిప్రజెంట్ చేయవచ్చు. పారిశ్రామిక వివాదాల చట్టం, సెక్షన్ 25టి ప్రకారం ఏ యజమాని, కార్మిక సంఘం, కార్మికుడు ఎటువంటి కార్మిక వ్యతిరేక చర్యలకు పాల్పడకూడదు. అలా చేస్తే వేయాల్సిన శిక్షలను రూపొందించారు. భారతదేశంలో వేల యజమానులు నిత్యం చట్టవిరుద్ధంగా ప్రవర్తిస్తున్నా ప్రభుత్వ యంత్రాంగం ఒక్క యజమానిపైనా చర్యలు చేపట్టలేదు. వేలాది మంది కార్మిక నాయకులు, కార్మికులు మాత్రమే వివక్షకు గురవుతున్నారు. అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా దీన్ని వ్యతిరేకించారు.

ఫ్యాక్టరీల చట్టం 1948కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని సవరణలు చేశాయి. ఏ సంస్థలోనైనా పనిచేసే పర్మినెంటు కార్మికుల సంఖ్య 40 ఉంటేనే ఈ చట్టం వర్తిస్తుంది. దీని వల్ల దేశంలో 70శాతం సంస్థలు చట్టాల నుండి మినహాయింపు పొందుతాయి. స్ప్రెడ్ ఓవర్‌టైమ్‌ను 10.30 గంటల నుండి 12 గంటలకు పెంచారు. ఓవర్‌టైమ్ పని గంటలను 50 నుండి 125 గంటలకు పెంచారు. ఒక క్వార్టరులో రాష్ట్ర ప్రభుత్వం అనుమతి లేనిదే ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు తనిఖీలు చేసి యజమానులపై చట్ట ఉల్లంఘనకు కేసులు పెట్టకూడదు. వీటి వల్ల భవిష్యత్‌లో ఆటవిక రాజ్యం ఏర్పడుతుంది. కార్మికులు బానిసలుగా తయారవుతారు. పారిశ్రామిక వివాదాల చట్టం 1947లో సెక్షన్ 25ను సవరించడం ద్వారా నూటికి 70శాతం ఆ చట్టం నుండి మినహాయింపు పొందుతారు. 300 మంది కార్మికులున్న ప్రతి సంస్థకూ ఈ మినహాయింపు ఉంటుంది. సెక్షన్ 25లో పొందుపర్చిన సౌకర్యాలు ఉద్యోగ భద్రత, లేఆఫ్, మూసివేత, లాకౌట్, నష్టపరిహార హక్కులు హరించివేయబడ్డాయి.

యాజమనులకు అనువుగా సవరణలు

కాంట్రాక్టు లేబరు యాక్టు 1970ను సవరించడం ద్వారా దేశంలో నూటికి 90 శాతం కార్మికులు ఆ చట్టం వెలుపలకు వస్తారు. 50 మంది కార్మికుల వరకు రిజిస్ట్రేషన్, లైసెన్సులు లేకుండా యజమానులకు మినహాయింపు ఇచ్చారు. చట్ట సవరణ ద్వారా ఆటవిక రాజ్యానికి ఇది దారితీస్తుంది. ప్రతిఏటా వివిధ చట్టాల ప్రకారం యజమానులు వివిధ శాఖలకు పంపే 26 రకాల యాన్యువల్ రిటర్న్‌లను నిలుపుదల చేస్తూ చట్ట సవరణ తెచ్చారు. దీనిద్వారా చట్టాలను ఉల్లంఘించే ఏ సంస్థ యాజమాన్యం చట్టానికి దొరక్కుండా తప్పించుకునే అవకాశం కల్పించారు. కార్మికులకు ఉద్యోగ భద్రత, సంక్షేమం, ఆరోగ్యం, సేఫ్టీ, విశ్రాంతి, పనిగంటలు, వారాంతపు సెలవులు, వేతనంతో కూడిన సెలవులు, బోనస్, ఫ్రెంజ్ బెనిఫిట్స్ (రిటైర్‌మెంట్ బెనిఫిట్లు) అత్యధిక శాతం కార్మికులకు నిరాకరించారు.

మేడేను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్

మేడేలో కార్మికులందరూ పాల్గొని ఐక్యతను చాటి చెప్పాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం.సుందర్‌బాబు ఆదివారం పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా గోడపత్రికను ఆవిష్కరించారు. అనంతరం సుందర్‌బాబు మాట్లాడుతూ అమరవీరుల రక్త తర్పణలతో నాడు సాధించుకున్న హక్కులపై ప్రపంచీకరణ పేరుతో నేడు పాలకులు దాడి చేస్తున్నారన్నారు. దేశాన్ని పాలిస్తున్న బిజెపి కార్మిక చట్టాలపై దాడి చేస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు పెట్టుబడిదారులకు కారు చౌకుగా అమ్మేస్తున్నారన్నారు. కార్మిక హక్కుల నిర్వీర్యం చేసే నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాన్నారు. జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వల్లేపల్లి నరసింహమూర్తి, జిల్లా గౌరవాధ్యక్షులు మైగాపుల నాగేశ్వరరావు సిఐటియు కొవ్వూరు కమిటీ అధ్యక్షులు మద్దుకూరి దొరయ్య ప్రధాన కార్యదర్శి బీరా రవి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న పలు సంఘాల నాయకులు

విశాఖ ఉక్కు పరిరక్షణకు 3న రాస్తారోకో

ప్రజాశక్తి-కాకినాడ

విశాఖ ఉక్కు పరిరక్షణకు కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మే 3న జరిగే రాస్తారోకోను జయప్రదం చేయాలని పలువురు పిలుపు ఇచ్చారు. కచేరిపేటలోని సిఐటియు కార్యాలయంలో ఆదివారం కేంద్ర కార్మిక సంఘాల సన్నాహక సమావేశం ఐఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, సిఐటియు అఖిలభారత ఉపద్యక్షురాలు జి.బేబిరాణి, ఐఎఫ్‌టియు జిల్లా సహాయ కార్యదర్శి గుబ్బల ఆదినారాయణ, ఐఎన్‌టియుసి కాకినాడ నగర అధ్యక్షులు తాళ్లూరి రాజు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమను దొడ్డిదారిన ప్రైవేటీకరణ చేయాలని ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఇటీవల కేంద్ర మంత్రి విశాఖ ఉక్కు పరిశ్రమను సందర్శించిన సందర్భంగా ఇప్పట్లో ప్రైవేటీకరణ చేయమని ప్రకటించిన గంటల్లోనే మాట మార్చి ఆంధ్ర ప్రజల మనోభావాలను దెబ్బతీశారని విమర్శించారు. ప్రజలు పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కును కాపాడుకునేందుకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రత్యక్షంగా 30 వేల మందికి, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి కల్పించే విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేయడం అంటే ఉన్న ఉద్యోగులను తొలగించడమేనని గుర్తు చేశారు. బిజెపి ప్రభుత్వం పచ్చి కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ 150 సంవత్సరాల చరిత్ర గల పోస్టల్ ఎంప్లాయిూస్ యూనియన్ గుర్తింపును రద్దు చేయడాన్ని ఖండిస్తూ పోస్టల్ ఉద్యోగులు చేసే పోరాటాలకు కేంద్ర కార్మిక సంఘాలు సంఘీభావం ప్రకటించారు. రాష్ట్రంలో ఉన్న పరిశ్రమలు మూతపడుతున్న పరిస్థితుల్లో నవరత్న హోదా కలిగిన విశాఖ ఉక్కుని కాపాడుకునేందుకు కేంద్ర కార్మిక సంఘాలు చేసే పోరాటాలకు ప్రజలు, రాష్ట్ర అభివద్ధిని ఆకాంక్షించే మేధావులు, అధికార, ప్రతిపక్ష రాజకీయ పార్టీలు మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సన్నాహక సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దువ్వా శేషబాబ్జి, చెక్కల రాజ్ కుమార్, జిల్లా కోశాధికారి మలకా రమణ, నగర ఉపాధ్యక్షులు మేడిశెట్టి వెంకటరమణ, ఐఎన్‌టియుసి ఉపాధ్యక్షురాలు కె.రమాదేవి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ భాషా, మెంబర్ దేవి పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న పలు సంఘాల నాయకులు

దేవస్థానం ఆసుపత్రిలో ఇఒ రక్తదానం

ప్రజాశక్తి-అన్నవరం

అన్నవరం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత ఆసుపత్రిలో సంకల్పం చేయూత హెల్పింగ్ వింగ్స్ సహకారంతో ఆదివారం రక్తదానం శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా దేవస్థానం ఇఒ ఎస్ చంద్రశేఖర్ ఆజాద్ పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆజాద్ మాట్లాడుతూ రక్తహీనత వల్ల ఎందరో రోగులు ఇబ్బంది పడుతున్నారని, ప్రాణాలు కూడా కోల్పోతున్నారని చెప్పారు. అటువంటి వారి కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా రక్తదానాన్ని అందించాలన్నారు. శిబిర నిర్వాహకులు జగదీష్ మాట్లాడుతూ వార్షిక బ్రహ్మోత్సవాల్లో తీరిక లేని సమయంలో కూడా శిబిరంలో రక్తదానం చేయడం ఆజాద్ సేవా తత్పరతకు నిదర్శనం అని అన్నారు.

మంత్రి రాజాను కలిసిన డిఎస్‌పి

ప్రజాశక్తి-కోటనందూరు

పెద్దాపురం డిఎస్‌పిగా బాధ్యతలు చేపట్టిన లతా కుమారి ఆదివారం రోడ్లు భవనాల శాఖామంత్రి దాడిశెట్టి రాజాను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛాన్ని అందజేశారు. ఏలూరు జిల్లా పోలవరంలో విధులు నిర్వహిస్తూ ఇటీవల బదిలీల్లో పెద్దాపురం వచ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రణాళిక రూపొందించామని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటామని డిఎస్‌పి తెలిపారు.

రేపు సాఫ్ట్‌బాల్ పోటీలకు సెలక్షన్స్

ప్రజాశక్తి-కాజులూరు

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జూనియర్ బాలుర, బాలికల సాఫ్ట్ బాల్ సెలెక్షన్స్ మే2న జరుగుతాయని జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు జె.హరికృష్ణ, ఎఎన్ రాంప్రసాద్ తెలిపారు. ఆదివారం గొల్లపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో అధ్యక్ష, కార్యదర్శులు హరికృష్ణ, రాంప్రసాద్ మాట్లాడుతూ మే 2న గొల్లపాలెంలో సెలక్షన్స్ నిర్వహిస్తున్నామని, 2006 జనవరి 1 తరువాత జన్మించిన వారందరూ ఈ సెలక్షన్‌లో పాల్గొనడానికి అర్హులని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు కడప జిల్లా రాయెుచోటిలో మే 26 నుంచి 28 వరకు జరిగే 10వ జూనియర్ అంతర్ జిల్లాల సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పాల్గొనే క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్ కార్డు, రెండు జిరాక్స్‌లు, రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు, జనన ధ్రువపత్రం, తీసుకుని రావాలని సూచించారు.

మేడే జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - పెద్దాపురం

కార్మిక దినోత్సవం మే డే సందర్భంగా పెద్దాపురంలో జరిగే మేడే ప్రదర్శన, అనంతరం మెయిన్ రోడ్డు ఆంజనేయస్వామి గుడి సెంటర్లో జరిగే బహిరంగ సభలను జయప్రదం చేయాలని సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు డి.క్రాంతికుమార్, గడిగట్ల సత్తిబాబు విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో వివిధ కార్మిక సంఘాల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు మేడే జెండాలను ఆవిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో సిరపరపు శ్రీనివాస్ ప్రసంగించారు.

4 నుంచి సమ్మర్ క్యాంప్

ప్రజాశక్తి - యానాం

యానాం ఓల్డేజ్ హోమ్ ఆధ్వర్యంలో మే 4న బేబీ కేర్ సెంటర్‌లో చిన్నారులకు వేసవి శిక్షణ శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు హోమ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లాడి కృష్ణారావు తెలిపారు. ఈ శిక్షణలో కిడ్స్ యోగ, అందమైన చేతిరాత, బొమ్మలు వేయడం వంటివి నేర్పిస్తారన్నారు. ఈ శిక్షణ 16 రోజులపాటు ఉదయం 9 నుంచి 12 గంటల వరకూ ఉంటుందన్నారు. నాలుగు నుంచి ఆరేళ్లలోపు పిల్లలు ఈ సమ్మర్ క్యాంపు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా కోరారు.

రైతాంగానికి సదుపాయాల కల్పనే ధ్యేయం

ప్రజాశక్తి- తాళ్లరేవు

రైతులకు మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా పని చేస్తామని ముమ్మిడివరం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కుడుపూడి శివన్నారాయణ అన్నారు. శివన్నారాయణ స్వగహంలో ముమ్మిడివరం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించరాఉ. తాళ్లరేవులో మార్కెట్ యార్డు నిర్మాణానికి, ఐ.పోలవరంలో గొడౌన్ ఏర్పాటుపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ డైరెక్టర్లను, ఎక్స్ అఫిషియో సభ్యులను శివన్నారాయణ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎపి స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ భూపతి రాజు బుల్లిరాజు, ముమ్మిడివరం నగర పంచాయతీ ఛైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ కాశి హనుమంతరావు, నగరపాలక వైసిపి అధ్యక్షులు బొంతు సత్య శ్రీనివాస్, డైరెక్టర్లు సంగాని వీర నాగేశ్వరమ్మ, ముసునూరి శ్రీలత, సవరపు లోవలక్ష్మి, ముదునూరి వెంకటేశ్వరరాజు, మందపాటి మహాలక్ష్మి, కాజా అరుణ, బసవ రామ లక్ష్మణరావు, నక్క మరియ, వరసాల రమాదేవి, టి.ప్రభాకర్‌రావు, చింతలపూడి చిట్టిబాబు, రమణాతి బాలకష్ణను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎడ్ల కుటుంబరావు, పెసింగి శివ, పెసింగి సతీష్ పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో డిఎస్‌పి తనిఖీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

నూతన డిఎస్‌పిగా బాధ్యతలు చేపట్టిన లతా కుమారి ఆదివారం పెద్దాపురం పోలీస్ స్టేషన్ సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె పెద్దాపురం పోలీస్ స్టేషన్లో నమోదైన కేసుల వివరాలు, పరిష్కరించిన కేసులు, పెండింగ్‌లో ఉన్న కేసులు, ట్రాఫిక్ తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐ షేక్ అబ్దుల్ నబీ పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లోనే స్పందన

ప్రజాశక్తి-కాకినాడ

మే నెల మొదటి సోమవారం 1న జిల్లా స్థాయి స్పందన ప్రజా విజ్ఞాపనల స్వీకరణ కార్యక్రమం కాకినాడలో కలెక్టరేట్ లోనే ఉదయం 9-30 గంటల నుండి జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. అర్జీదారులు, జిల్లా అధికారులు ఈ అంశాన్ని గమనించాలని కలెక్టర్ కోరారు.

ప్రత్తిపాడు బార్ అధ్యక్షునిగా చిట్టంశెట్టి

ప్రజాశక్తి-ఏలేశ్వరం

అత్యంత ప్రతిష్టాత్మంగా జరిగిన ప్రత్తిపాడు కోర్ట్ బార్ అసోసియేషన్ ఎన్నికల్లో సీనియర్ న్యాయవాది చిట్టంశెట్టి పుల్లయ్య ప్యానల్ ఘనవిజయం సాధించింది. అధ్యక్షునిగా పుల్లయ్య తమ సమీప ప్రత్యర్థి ఎ.సుగుణపై 24 ఓట్ల అధిక్యత సాధించారు. కార్యదర్శిగా బొంగులూరి మధుబాబు, ఉపాధ్యక్షునిగా మల్ల గంగాధర్ అధిక్యత సాధించారు. కోశాధికారిగా జొన్నాడ అప్పలరాజు విజయం సాధించారు.

ఘనంగా అచ్చంపేట స్కూల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి- సామర్లకోట రూరల్

విద్యపై పెట్టే పెట్టుబడి ఎప్పటికీ వృథా కాదని ఎపి స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దవులూరి దొరబాబు పేర్కొన్నారు. అచ్చంపేట మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల 95వ వార్షికోత్సవం హెచ్ఎం నల్లం అచ్యుత రామచంద్రమూర్తి అధ్యక్షతన ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వార్షికోత్సవంలో దొరబాబు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా సుమారు 800 మంది విద్యార్థుల తల్లిదండ్రులతో పాఠశాల 95 వార్షికోత్సవం నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. పాఠశాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న హెడ్మాస్టర్ నల్లం అచ్చుత రామచంద్ర మూర్తిని దొరబాబు అభినందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఎలిసెట్టి నరేష్, వైస్ ఎంపిపి వెంకటరాయుడు, గ్రామ సర్పంచ్ వీరం రెడ్డి చినబాబు, మాజీ సర్పంచ్ సలాది రమేష్ బాబు, సొసైటీ ఛైర్మన్ వీరం రెడ్డి నాని, ఎంఇఒ వై.శివరామకష్ణయ్య, మండల వైసిపి అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, ఉప సర్పంచ్ విష్ణు, పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ నక్క లక్ష్మణరావు, ఎస్‌టియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కాశి, శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఎస్ఎంసి సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


సభలో మాట్లాడుతున్న దవులూరి దొరబాబు

బిజెపి స్వార్థం కోసం దేశంలో మతచిచ్చు

ప్రజాశక్తి-సామర్లకోట

స్వార్థ రాజకీయాల కోసం దేశంలో బిజెపి మత చిచ్చు పెడుతోందని, విదేశాలు రగిలిస్తున్న మతోన్మాద బిజెపికి వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కరణం ప్రసాదరావు అన్నారు. ఆదివారం స్థానిక బళ్ల మార్కెట్ సెంటర్‌లో బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆదివారం చేపట్టిన ప్రచార బేరి ముగింపు సమావేశంలో ప్రసాదరావు మాట్లాడుతూ.. బిజెపి పాలనలో దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, బిజెపి ఆర్ఎస్ఎస్ కూటమి విచ్ఛిన్న రాజకీయాలు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని అన్నారు. బిజెపి అధికారంలోకి రాకముందు రాష్ట్రానికి అనేక హామీలనిచ్చినా అధికారంలోకి వచ్చాక విస్మరించిందని విమర్శించారు. బిజెపి విచ్ఛిన్నకర విధానాలకు వ్యతిరేకంగా సాగే పోరాటాల్లో ప్రజలంతా కలిసి రావాలని పిలుపునిచ్చారు. దేశంలోని బడా కార్పొరేట్ సంస్థలకు వివిధ రూపాల్లో ప్రభుత్వ రంగ సంస్థలను అప్పజెప్పి దేశ ప్రభుత్వ ఆస్తులను కారుచౌకగా కార్పొరేట్లకు బిజెపి అందించడం దారుణమన్నారు. నాడు అనేకమంది త్యాగదనులు బ్రిటిష్ వలస పాలనను ఎదిరించి తరిమికొట్టి మనకు స్వాతంత్రం తీసుకువచ్చారని, నేడు అదే స్వాతంత్రం ప్రమాదంలో పడిందన్నారు. దాన్ని కాపాడుకోవడానికి జాతీయ ఉద్యమ స్ఫూర్తితో మళ్ళీ ఉద్యమించాల్సిన సమయం వచ్చిందన్నారు. రోజు రోజుకూ పేద ప్రజలపై మోపుతున్న నిత్యవసర ధరలను అదుపు చేయాలని లేకుంటే సామాన్యుని జీవనం మరింత భారంగా తయారవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం శాఖ కార్యదర్శి బాలం శ్రీనివాస్, కరణం శ్రీనివాస్, కొత్తూరు తులసీదాస్ భక్తుల బాలాజీ కరణం సత్యనారాయణ, సైపురెడ్డి యువరాజు, బాలం ప్రవీణ్, కోన శీను, కరణం రామకష్ణ, సిహెచ్.మహేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం భేరిలో పాల్గొన్న సిపిఎం నాయకులు

కానరాని కనీస సౌకర్యాలు



చెరువు పూడిక తీత పనుల్లో కూలీలు



మొక్కుబడిగా వేసిన టెంట్

ఇబ్బందులు పడుతున్న ఉపాధి కూలీలు

ప్రజాశక్తి-మండపేట

ఎండలు మండిపోతున్నా కూలీల భద్రతకు కనీస సౌకర్యాలు కానరావడంలేదు. పని ప్రదేశంలో టెంట్లు, తాగునీటి సదుపాయాలు లేక, పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో కూలీలు అవస్థలు పడుతున్నారు. మండలంలోని ఉపాధి పనులను పరిశీలిస్తే, కూలీల పరిస్థితి ఇట్టే అర్థమైపోతుంది.

మండపేట మండలంలో 12,126 జాబ్ కార్డులు ప్రతి రోజు 2700 మంది కూలీలు పనులకు వెళుతున్నారు. మేజర్ పంచాయతీలయిన ఏడిద, ద్వారపూడి, కేశవరంలతోపాటు ఇప్పనపాడు గ్రామలలో చెరువుల పూడికతీత పనులు జరుగుతుండగా మిగిలిన గ్రామాల్లో ఫీల్డ్ చానల్స్ పనులు చేస్తున్నారు. పని ప్రదేశంలో టెంట్లు, చలి వేంద్రాలు కానరావడం లేదు. గతంలో ఎండలకు చలువ పందిల్లు ఏర్పాటు చేశారు. కానీ ఈ ఏడాది ఎటువంటి సౌకర్యాలు లేకపోవడంతో మండే ఎండల్లో కూలీలు నానా అవస్థలు పడుతున్నారు. కనీసం సౌకర్యాలు కూడా లేకపోవడంతో ఎండల తీవ్రతకు కూలీలు విలవిలలాడుతున్నారు. పని ప్రదేశంలో మంచినీటి సౌకర్యం లేకపోవడంతో కూలీలు ఇంటి నుంచే మంచినీరు తెచ్చుకుంటున్నారు. అవి వేడి ఎక్కిపోతుండటంతో తాగలేకపోతున్నామని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కూర్చొనేందుకు వీలులేకుండా..

కొన్నిచోట్ల పని ప్రదేశాల్లో టెంట్లు మొక్కుబడిగా వేస్తున్నారు. అవి ఎండకు ఏమాత్రం కాయడంలేదని కూలీలు అంటున్నారు. కనీసం ఉదయం అల్పహారం తీనే సమయంలోనైనా కూర్చొనేందుకు వీలువుండడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అదనంగా ప్రయాణ ఖర్చు

పని ప్రదేశం గ్రామం నుంచి సుమారు 2 నుంచి 3 కి.మీ ఉండడంతో రోజుకి రూ.20 చొప్పున అదనంగా ఖర్చు పెడుతున్నామని కూలీలు వాపోతున్నారు. సుమారుగా 272 రూపాయలు కూలీకాగా 20 రూపాయలు ఆటోకు ఇవ్వాల్సి వస్తుందన్నారు. ఇది ఇలా ఉండగా గత ఏడాది ఉపాధి పనుల్లో తాపేశ్వరం, కేశవరం, అర్తమూరులలో ముగ్గురు కూలీలు మృత్యువాత పడ్డారు. దీంతో ఎండలు పెరుతున్న నేపథ్యంలో కూలీలు ఆందోళన చెందుతున్నారు.

కేంద్రానికి ఉపాధిపై తగ్గిన మమకారం

ఆలమూరు కేంద్ర ప్రభుత్వం 2022 ఏప్రిల్ నుండి నేషనల్ ఇన్ఫర్మేషన్ సెంటర్(ఎన్ఐసి) యాప్ ను ప్రవేశపెట్టి ఉపాధి పథక పనులను దేశం మొత్తంగా ఈ యాప్ లోనే అప్లోడ్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. అలాగే పని దినాల్లో కోత కోస్తూ బడ్జెట్లో నిధుల కేటాయింపు తగ్గించింది. గతంలో ఉదయం ఒక్కసారి మాత్రమే మస్తర్ వేస్తూ వస్తున్న ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు, సీనియర్ మేట్లు ఇప్పుడు ఉదయం, మధ్యాహ్నం కూడా మస్తర్లు వేసి అప్లోడ్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో కూలీలు, మేట్లు మధ్య అవగాహన లోపించి సమస్యల్లో చిక్కుకుంటున్నారు. దీనిపై ఉపాధి హామీ ఉన్నతాధికారులను వివరణ కోరగా కింది విధంగా స్పందించారు.

పని ప్రదేశాల్లో టెంట్లు వేస్తున్నాము

గతంలో ప్రభుత్వం ఇచ్చిన టెంట్లనే పని ప్రదేశల్లో వేస్తున్నాము. ఒఆర్ఎస్ఎల్ ప్యాకెట్లను మేట్లు కూలీలకు అందిస్తున్నారు. 5 కిలోమీటర్లు దాటితేనే ట్రావెలింగ్ అలవెన్సు వస్తుంది.

-టి.శ్రీప్రియ, ఎపిఒ, మండపేట

ప్రత్యేక అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నాం

మండల పరిధి 18 గ్రామాల్లో 11 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు, 6గురు సీనియర్ మెట్లు ఉన్నారు. ఉపాధది పనులను వారు పరిశీలిస్తూ మస్తర్లు వేస్తున్నారు. పని విధానంపై ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం.

-పివివివి.ప్రసాద్, ఎపిఒ(ఎఫ్ఎసి), ఆలమూరు

నేడు తాగునీటి సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-మండపేట

స్థానిక పురపాలక సంఘ పరిధిలో బూరుగుంట చెరువు వద్ద ఉన్న 1450 కిలోలీటర్ల రిజర్వాయర్ అవుట్ లెట్ వాల్వు మరమ్మత్తులు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో మే 1 తేదీ సాయంత్రం నుంచి 2 తేదీ ఉదయం వరకు తాగునీటి సరఫరా నిలిపివేస్తారనికమిషనర్ టి.రామ్ కుమార్ తెలిపారు. ప్రజలు సహకరించాలన్నారు.

నేటి నుంచి పాఠశాలకు వేసవి సెలవులు

ప్రజాశక్తి-మండపేట

మండలంలో ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలకు సోమవారం నుంచి ప్రభుత్వం వేసవి సెలవులు ప్రకటించిందని ఎంఇఒ నాయుడు రామచంద్రరావు తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ జూన్ 12న పాఠశాలలు తిరిగి ప్రారంబిస్తామన్నారు. చివరి రోజు ఆదివారం విద్యార్థులు ఆట పాటలతో ఆనందంగా గడిపారు.



స్వామి వారి చిత్రపటాన్ని అందిస్తున్న అర్చకులు

అయినవిల్లిని సందర్శించిన జిల్లా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి

ప్రజాశక్తి-అయినవిల్లి

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అయినవిల్లి విఘ్నేశ్వర స్వామిని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వి.గౌరీ శంకర్ దర్శించుకున్నారు. అమలాపురం కోర్టు నందు నూతనంగా ఆయన ఆదివారం బాధ్యతలు స్వీకరిస్తున్న సందర్భంగా అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి ని దర్శించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ముందుగ ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. ఆలయ ప్రధాన అర్చకులు వేద ఆశీర్వచనం అందజేసి, శేష వస్త్రాలతో సత్కరించి, స్వామి వారి చిత్రపటం బహూకరిచారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం పాసిల వారి వీధి వినాయకుని గుడి సెంటర్లో పాసిల వీధి యూత్ ఆధ్వర్యంలో ఆదివారం మజ్జిగ చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు మాట్లా డుతూ నెక్కల అంజి,గంటాడ సతీష్ ల ఆర్థిక సహకారంతో ఈ మాజ్జిగ చలివేంద్రం నిర్వహించామన్నారు.

ఏడిదలో 'వాసవి' గ్రామోత్సవం

ప్రజాశక్తి-మండపేట

వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మ వారి జయంతి సందర్భంగా ఏడిదలో ఆర్య వైశ్య సంఘం అధ్వర్యంలో ఆదివారం గ్రామోత్సవం నిర్వహించారు. వైస్ ఎంపిపి పసుమర్తి నాగేశ్వరావు, ఎంపిటిసి సభ్యులు పట్నాల నాగబాబు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పట్నాల మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

మేడే విజయవంతానికి పిలుపు

ప్రజాశక్తి - యంత్రాంగం

మేడే వేడుకలను విజయవంతం చేయాలని ప్రజాసంఘాల నాయకులు ఆదివారం పిలుపునిచ్చారు. మేడు సందర్భంగా నిర్వహించనున్న కార్యక్రమాల్లో కార్మికులు పాల్గొనాలన్నారు.

మండపేట కార్మికుల రోజు మే డే దినోత్సవాన్ని పురస్కరించుకుని మండపేట పట్టణంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని సిఐటియు జిల్లా కార్యదర్శి కె.కష్ణవేణి అన్నారు. ఆదివారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సోమవారం ఉదయం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరణ అనంతరం కలువ పువ్వు సెంటర్ నుంచి బస్టాండ్ వరకు భారీ ప్రదర్శన జరుగుతుందన్నారు. కరాచీ సెంటర్లో బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. కార్మికులంతా ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆమె కోరారు. **ఆలమూరు** మే 1న మేడేను పురస్కరించుకుని స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా ప్రతి ఏటా జరిగే విధంగానే ఈ ఏడాది నిర్వహించ తలపెట్టినట్లు యుటిఎఫ్ రాష్ట్ర సభ్యులు వైవివి.రమణ, మండల అధ్యక్షుడు అద్దరి శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం 8 గంటలకు సిఐటియు, అంగన్‌వాడీలు, తదితర ప్రజా సంఘాలన్నీ కలుపుకొని యుటిఎఫ్ ఆధ్వర్యంలో పతాక ఆవిష్కరన నిర్వహిస్తారన్నారు. అలాగే స్థానిక యుటిఎఫ్ కార్యాలయం నందు కూడా యుటిఎఫ్ జెండా వందన కార్యక్రమం జరుగుతుందన్నారు. సభ్యులంతా తప్పనిసరిగా హాజరు కావలని, మేడే వేడుకలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా పురస్కరించుకుని యుటిఎఫ్ సీనియర్ సభ్యులు కెవిఆర్ బాపూజీ దంపతులు యుటిఎఫ్ కార్యాలయానికి అంబేద్కర్, జ్యోతిరావు పూలే చిత్రపటాలను యుటిఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులకు ప్రదానం చేస్తారని వారు తెలిపారు. సీనియర్ నాయకులు జి.భాస్కర్ రెడ్డి, జి.ప్రకాశం హాజరుకానున్నారని, ముందుగా వారికి ఉద్యమాభినందనలు తెలిపారు. అలాగే మిగిలిన సభ్యులు కూడా అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ఓఎన్‌జిసి కాంట్రాక్ట్ వాహనాల డ్రైవర్లు

ప్రజాశక్తి -ఉప్పలగుప్తం

ఒఎన్‌జిసిలో కాంట్రాక్టర్ల దగ్గర వాహనాలపై పనిచేస్తున్న డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని కాంట్రాక్ట్ వాహనాల డ్రైవర్ల కమిటీ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాకు వినతి పత్రం అందజేశారు.వినతిపత్రం కాపీలను ఆదివారం మండలంలోని కాంట్రాక్ట్ డ్రైవర్లు విలేకరులకు అందజేశారు. ఒఎన్‌జిసి లో కాంట్రాక్టు పనులు నిర్వహిస్తున్న వారి దగ్గర సుమారు 20 ఏళ్ల నుంచి వారి వాహనాలపై డ్రైవర్లగా పనిచేస్తున్నామన్నారు. మాకు ఒఎన్‌జిసిలో ఏ ఒక్క కాంట్రాక్టర్ వచ్చినా డ్రైవర్లకు ఎప్పుడూ రావలసిన ప్రతి నెల జీతాలు గాని ఇఎస్ఐగాని, పిఎఫ్ గాని మాకు ఇవ్వడం లేదన్నారు. మండలంలోని ఒఎన్‌జిసి క్షేత్రాల్లో తాము 4వ తరగతి ఉద్యోగులుగా పనిచేస్తున్నామన్నారు. ఏ విధమైన సెలవులు లేకుండా నెలకు 30 రోజులు తమ విధులు నిర్వర్తిస్తున్నామన్నారు. ఈ విషయంలో ఒ ఎన్ జి సి సంస్థ దానికి అనుబంధంగా పనిచేస్తున్న కాంట్రాక్టర్ల నుంచి తమకు జీతాలు ఇతర సదుపాయాలు చెల్లించడంలో కనీసం బాధ్యత తీసుకోవడం లేదన్నారు. నాలుగైదు నెలలుగా కనీసం జీతాలు చెల్లించక పోవడంతో కుటుంబాలను పోషించుకోలేక కష్టాలు పడుతున్నామన్నారు. ఇప్పటికైనా తమ సమస్యల పై కలెక్టర్ స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశామని డ్రైవర్లు మాదే రాంబాబు, గుంట్రు చిట్టిబాబు అయితాబత్తుల రమేష్, ఎం.సత్య, ఐ.గంగాధరరావు తదితరులు కోరుతున్నారు.

ప్రధాన రహదారులు ఛిద్రం

ప్రజాశక్తి-రామచంద్రపురం



కూళ్ల నుంచి అముజూరు వెళ్లే రోడ్డు

మారుమూల ప్రాంతాల ప్రధాన రహదారులు అధ్వానంగా తయారయ్యాయి ఇప్పటికే పాడైపోయిన ఈ రోడ్లు ఇటీవల కురిసిన వర్షాలకు శిథిలావస్థకు చేరుకున్నాయి వీటిలో కె.గంగవరం మండలం లోని అముజూరు, వయా నరజాడ కూళ్ల రహదారి ఒకటి. ఈ రహదారి సుమారు 20 ఏళ్లగా అభివృద్ధికి నోచుకోలేదు. గోతులు ఏర్పడి రాత్రి పగలు తేడా లేకుండా ఎప్పుడు ప్రయాణం చేసిన ఇబ్బందులు తప్పడం లేదు. ఈ రోడ్డుకు కనీసం మరమ్మతులు లేకపోవడంతో పాటు గోతులు పూడ్చకపోవడంతో అనే ప్రమాదాలు చోటు చేసుకుం టున్నాయి సుమారు 7 కిలోమీటర్లు పొడవుండే ఈ రహదారిని ఆధునికీకరించాలని, అముజూరు, నరజాడ, కూళ్ల గ్రామాల ప్రజలు కోరుతున్నారు. దీనిపై అధికారులకు ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసిన పట్టించుకున్న దాఖలాలు లేవని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు దీనిపై రహదారి భవనాల శాఖ అధికారులు స్పందించి గోతులను పూడ్చాలని రోడ్డును వెంటనే ఆధునికీకరించాలని పరిసర ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

నిరుపయోగంగా చెరువు

ఆటస్థలంగా మార్చాలని కూళ్ల గ్రామస్తుల విజ్ఞప్తి

ప్రజాశక్తి-రామచంద్రపురం



కూళ్లలో నిరుపయోగంగా ఉన్న చెరువు

కె.గంగవరం మండలంలోని కూళ్ల గ్రామంలో నిరుపయోగంగా ఉన్న చెరువును పూడ్చివేసి గ్రామంలోని యువ కులకు ఆటస్థలంగా మార్చాలని ఆ గ్రామ స్తులు విజ్ఞప్తిచేశారు. ఇక్కడ గల దళితవాడకు ఆనుకుని ఉన్న చెరువు ఎన్నో ఏళ్లుగా నిరుపయోగంగా ఉంటుందని, ఉపయోగం లేని చెరువును పూడ్చివేసి గ్రామంలోని ఆటస్థలంగా మార్చాలని దళిత నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ మేరకు ఇటీవల గ్రామానికి వచ్చిన ఎంఎల్‌సి బొమ్మి ఇజ్రాయేల్‌కు గ్రామ పెద్దలు యువకులు ఈ విషయాన్ని పరిష్కరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా గ్రామపంచాయతీ అధికారులు దీనిపై చర్యలు తీసుకోవాలని ఉపయోగంలో లేని ఈ చెరువును పూర్తి చేసి గ్రామస్తులకు ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దాలని కూళ్ల గ్రామ దళితవాడ ప్రజలు కోరుతున్నారు. అదేవిధంగా ఈ చెరువు దగ్గర నుంచి వెళ్లే రోడ్డు పొడవునా వీధి దీపాలు కూడా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



సామాజిక కార్యకర్త కుంచే చిన బాబు ను సత్కరిస్తున్న దృశ్యం

అంబేద్కర్ సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి-ఐ.పోలవరం

బిఆర్.అంబేద్కర్ సేవలు చిరస్మరణీయమని గుత్తెనదీవి ఎం పి టి సి సభ్యురాలు జొన్నాడ జ్యోతి అన్నారు. బీర సాహెబ్ ఆధ్వర్యంలో ఆదివారం రాఘవేంద్రపురం గ్రామంలో అంబేద్కర్ జయంతిని నిర్వహించారు. ముందుగా ముఖ్య నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జి.వేమవరం జెడ్పి హైస్కూల్ ఆవర ణలో15 సంవత్సరాలు నుంచి ముసుగును వేసి ఉన్న అంబేద్కర్-గాంధీ విగ్రహాల పై ఉన్న ముసుగు ను తొలగించాలంటూ పోరాటం చేసి సాధించిన సామాజిక కార్యకర్త కుంచే చినబాబును గ్రామస్తులు సత్కరించారు. కార్యక్రమంలో రేవు అప్పలస్వామి, గంటా సూర్య చంద్రరరావు, పండు శ్రీను, పోతుల సూర్యనారాయణ, గొల్లపల్లి గంగాధరరావు, పవన్ కుమార్, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు

అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి సురేంద్ర ఆనంద్





కాకినాడ జిల్లాలో తరచూ జరుగుతున్న ప్రమాదాల నివారణకు అప్రమత్తంగా ఉన్నామని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ఎన్.సురేంద్ర ఆనంద్ అన్నారు. వేసవి నేపథ్యంలో పలు అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ఆయన సూచించారు.

అగ్నిమాపక వాహనాల పరిస్థితి ఎలా ఉంది..

ప్రతి 15 ఏళ్లకోసారి వాహనాలను మారుస్తూ ఉంటారు. ప్రస్తుతం జిల్లాలో కాకినాడ, జగన్నాయక్‌పూర్, పెద్దాపురం, ప్రత్తిపాడు, పిఠాపురం, తుని, జగ్గంపేటలో ఫైర్ స్టేషన్‌లలో అన్ని వాహనాలు కొత్తవే ఉన్నాయి. మూడేళ్ళ క్రితం కొత్త వాహనాలు జిల్లాకు వచ్చాయి. భవనాల కొరత కూడా లేదు. కాకినాడ, జగన్నాయక్ పూర్‌లో నూతన కార్యాలయాలు అందుబాటులోకి వచ్చాయి. 161 సిబ్బంది అవసరం కాగా 52 మంది కొరత ఉంది. ఎటువంటి ప్రమాదాలు సంభవించినా సిద్ధంగా ఉన్నాం.

ప్రమాదాల్లో ఎన్ని ఆస్తులను పరిరక్షించగలిగారు..

గతేడాది ఆర్థిక సంవత్సరంలో 557 ఫోన్ కాల్స్ రాగా వీటిల్లో 9 తీవ్రమైన ప్రమాదాలు జరిగాయి. 27 మీడియం, 451 చిన్న ప్రమాదాలు సంభవించగా రూ.5.98 కోట్లు ఆస్తి నష్టం జరిగింది. ఈ ప్రమాదాల్లో రూ.19.10 కోట్ల ఆస్తులను కాపాడగలిగాము. మాకు వచ్చిన అగ్ని ప్రమాదం కాల్స్‌లో ముగ్గురి ప్రాణాలను రక్షించగలిగాము. అత్యవసర కాల్స్‌లో 63 మంది మనుషులను, 35 జంతువులను కాపాడాము.

మీ శాఖ పని విధానం ఎలా ఉంది..

ప్రమాదాలు సంభవించిన తర్వాత కాల్ సెంటర్ ద్వారా సమాచారం అందిన వెంటనే సంఘటనా స్థలం వద్దకు చేరుతున్నాం. పూరి పాకలు, గడ్డి వాముల ప్రమాదాలు ఎక్కువగా ఉన్నాయి. కేవలం అగ్నిప్రమాదాలకే పరిమితం కాక ప్రకతి వైపరీత్యాలు, రోడ్డు, రైలు ప్రమాదాలు, వానలు, వరదలు, భూకంపాలు ఇతర ప్రాణాపాయ పరిస్థితులు ప్రజలకు ఏర్పడినప్పుడు విపత్తుల శాఖగా వెంటనే రంగంలోకి దిగుతున్నాము. బాధితులు, ఆర్తులకు అవసరమైన సేవలు అందించడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టాన్ని సాధ్యమైనంత తగ్గించడానికి ప్రయత్నిస్తున్నాం. అగ్నిప్రమాదాలు జరిగిన సమయంలో సమర్థంగా విధులు నిర్వర్తించడానికి ఉపయోగపడే అగ్ని నిరోధక దుస్తులు కూడా మా వద్ద అందుబాటులో ఉన్నాయి. వరదలొస్తే వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించడానికి 'విపత్తుల స్పందన, అగ్నిమాపకశాఖ'గా మా వద్ద కొన్ని పరికరాలున్నాయి. వాటి సాయంతో రంగంలోకి దిగి బాధితులను ఆదుకుంటున్నాం.

ప్రమాదాల నివారణకు మీరిచ్చే సూచనలు ఏమిటి..

ఆసుపత్రులు, హోటళ్లు, షాపింగ్ కాంప్లెక్సుల చుట్టూ ఫైర్ ఇంజన్ తిరిగేందుకు వీలుగా నాలుగు మీటర్లు ఖాళీ స్థలం ఉండాలి. భవనాల చుట్టూ పైపులైన్లతో కూడి హాజరీలు అమర్చాలి. ఆయా భవనాల ముందు భాగంలో డెకొరేటివ్ గ్లాస్‌లతో మూసివేయకుండా గాలి వెలుతురు వచ్చే కిటికీలు ఏర్పాటు చేయాలి. ఆయా భవనాలు ముందు పెద్ద సైజ్ హోర్డింగ్‌లు ఏర్పాటు చేయకూడదు. 10 వేల మీటర్ల నీటి సామర్థ్యం గల ట్యాంకులను అమర్చుకోవాలి. నీళ్ళు తోడటానికి అనువుగా మోటార్‌ను అమర్చాలి. భవనాలు వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఉంటే దాని చుట్టూ సేఫ్టీ పెన్సింగ్ ఏర్పాటు చేయాలి. 45 లీటర్ల ఫోమ్‌ట్రాలీ, కంకరతో సోఫ్‌పిట్ ఏర్పాటు చేసుకోవాలి. భవనాలకు ఒకే స్టెయిర్ కేసు కాక అత్యవసర సందర్భాల్లో మరో స్టెయిర్‌కేస్ సౌకర్యం సమకూర్చుకోవాలి. ఎమర్జెన్సీ లైట్లు, అధిక విద్యుత్తు సరఫరా అయినప్పుడు విద్యుత్ సరఫరా నిలిచిపోయేలా సర్క్యూట్ బ్రేకర్లు అమర్చుకోవాలి.

:: ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి ::



బీచ్ రోడ్‌లో ట్రాఫిక్ రద్దీ

ఉప్పాడ తీరంలో పర్యాటకుల రద్దీ

యు.కొత్తపల్లి : ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ఉప్పాడ తీరంలో సేదా తీరేందుకు పర్యాటకులు అధిక సంఖ్యలో ఉప్పాడ తీరానికి చేరుకున్నారు. ఆదివారం సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా మార్పు చెందడంతో వేల సంఖ్యలో పర్యాటకులు రావడంతో వాహనాలకు కొద్దిపాటి అంతరాయం చోటు చేసుకుంది. నేమాం సమీపం వద్ద బీచ్ రోడ్డు కోతకి గురి కావడంతో రోడ్డు ధ్వంసం అయ్యింది. దీంతో అటుగా ప్రయాణించే వాహన దారులు నానా ఇబ్బందులకు గురయ్యారు. వందల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు రావడంతో నిలుపుదల చేసేందుకు స్థలం లేకపోవడంతో బీచ్ రోడ్డు ఇరుపక్కల నిలుపుదల చేయడంతో ప్రయాణికులకు అకచాట్లు తప్పడం తప్పలేదు కనీసం ఆదివారం సమయంలోనైనా ఉప్పాడ తీరంలో పోలీస్ బందోబస్తుని ఏర్పాటు చేస్తే బాగుంటుందని పర్యాటకులు తెలుపుతున్నారు. పాఠశాలలు సెలవులు కావడంతో పర్యాటకుల తాకిడి అధికంగా ఉంది పర్యాటకులకు కనీస సౌకర్యాలు ఉప్పాడ తీరంలో ఏర్పాటు చేయాలని పర్యాటకులు కోరుతున్నారు.

